# 5

# ఇల్లు జాగ్రత్త

"ప్రేమకి పడిశం పట్టినట్లుంది-" అని కాస్త నొక్కి వాక్యం పూర్తిచేసింది యింటావిడ.

"ఇదే ఏదో కథలో మొదటి వాక్యమైతే, ఎంత రసాభాస అవుతుందో ఆలోచించావా?" అన్నాను కావాలని. "మనకి ప్రేమ అనే ఆరు నెల్ల అమ్మాయి వుందని, దానికి పడిశం పట్టిందని వాళ్ళ అమ్మ చెప్తోందనీ-ప్రపంచానికి తెలీడ మెల్లాగ?" అన్నాను కాస్త నాటకంలోలా అభినయిస్తూ.

"చాల్లెండి మీరూ మీ వెటకారాలూనూ...." అంటూ కిటికీ తలుపుల్ని తెరిచి తెరల్ని గుంజుతూ "ఉక్క చంపేస్తూందండీ! ఏం వూరో యేం పాడో....స్నానాల గదిలో నీళ్ళు లేవు. వంటగదిలో ఒక్కబొట్టు కూడా రాలటం లేదు. దొడ్డిలో మంతెడు నీళ్ళన్నా రావటంలేదు. ముదనష్టం పంపులు ఎందు కిన్ని?" స్వగతం చెప్పుకుపోతోంది కిటికీ తెరల్ని కోపంగా వూడలాగుతూ.

నాకు అకస్మాత్తుగా తెలి వొచ్చి పడింది. "ఆగు! ఏవి టాపని-చూస్తున్నావా నా వేషం? నీ కింత మతిపోతూందే? ఉక్క దంచేస్తూందని నే నిల్లా అర్ధ నగ్నంగా తగులడ్డానా- నువ్వాకిటికీ తలుపు లన్నీ బార్లా తెరిచేస్తావు గదా! నలుగురూ యేమనుకుంటారే?"

నేను చిన్న తువ్వాలుముక్క చుట్టుగుని వాలు కుర్చీలో పేపరు చూస్తూ అఘోరిస్తున్నాను. ఆవిడ పల్చటి చీర చుట్టుకుని తలంతా విరియబోసుకుని వుసురుసురంటూ వచ్చింది.

"అల్లా వెళ్ళి రెండు బాల్చీలు నీళ్ళు పట్రాకూడదూ? చక్కగా స్నానంచేసి అటెక్కడికన్నా సాయంత్రం పోయి రావచ్చు!"

నాకసలే వుడుకు మోతుతనంగా వుంది. పై పెచ్చు సన్నాయి నొక్కులు...."చాల్లే సంతోషించాం! తెలివి తేటలు-"అని చిరాగ్గా అరిచాను.

కాస్త చిన్నబుచ్చుకున్నదల్లే వుంది. నెమ్మదిగా గదిలో తచ్చా

ట్లాడుతూ పవిటతో విసురుకుంటూ-"మగవారు- నలుగురు బిడ్డల తండ్రి. చదువుకున్నవారు. అంతో యింతో పేరూ ప్రఖ్యాతివుంది నలుగుర్లో. మన పని మనం చేసుకోవటం తప్పా- అల్లా చిర్రు బుస్సుమంటా రెందుకూ? నాకు తెలుసులెండి- మీ కెందుకో చెడ్డ కసిగా వుంది నా మీద." కాస్త గొంతుక బొంగురు పోయింది.

"కసా? నీ మీదా- నాకా? ఎందుకూ?" ఆడవాళ్ళకు చిత్రంగా వస్తాయి కన్నీళ్ళు. నా చేతుల్లోంచి పేపరు జారి వాళ్ళో పడింది మోకాళ్ళ కడ్డంగా.

"మీరు రమ్మనకుండా యిల్లా వచ్చాననని...."

ముఖంమీంచి చేతుల్ని లాగుతూ-"నోస్-అదా....ఛా....ఛా.... నా మాట విను. నా కల్లాటి దేం లేదు. ఎంత పొట్టుపడితే అంత పొట్టు!" అన్నాను.

నులకమంచంలో పసిది ఖళ్ళు ఖళ్ళున దగ్గుతోంది ఉంగలు చుట్టుకుపోతూ. స్నానాలగదిలో పంపు బుసలు కొడ్తోంది—నీళ్ళు వచ్చే సూచన! పాపని ఎత్తుకుని క్షణంలో జేగురించిన మొహంతో కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయింది గదిలో నుంచి.

"హమ్మయ్యా!" అని జావకడిలా కుర్చీలో వాలిపోయాను. ఎంత రసాభాస! నిజంగా తను రావటం ఇష్టంలేదని ఎలా కనిపెట్టేసిందో.... కనిపెట్టేసింది. పదేళ్ళు కాపురంచేసిన మనిషి....అంతమాత్రం గ్రహిం చుకోలేదా? నాకు మాత్రం తల కొట్టేసినంత చెడ్డ అవమానంగా వుంది.

నలుగురైదుగురు ఒకచోట చేరి కష్ట సుఖాల్నిగూర్చి చెప్పుకునే టప్పుడు జీవితాల్నిగూర్చి తెలుస్తూన్న సంగతులు మహాదారుణంగా వుంటున్నాయి. చేసుకున్న పెళ్ళాం పిల్లల్తో కాపురాని కొస్తే.... హఠాత్తుగా చెప్పకుండా చెయ్యకుండా వచ్చినందుకు ముఖం ముటముట లాడించుకుంటున్నాను. నా అసమర్థత కప్పిపుచ్చుకుందుకు గట్టిగా కసి రేస్తున్నాను.

ఇది ఢిల్లీ!

గుండె ఝల్లుమంటోంది!

ఈ పతాక మన శాంతిపతాక—

దీని నీడనే నేడు నేను భార్యాబిడ్డలను చీదరించుకుంటున్నాను.

శుభం మంగళానిభవంతు!

పాపం మిమ్మల్ని వదిలి వుండలేనండీ అని చెప్పడానికి నోరు రాక-హఠాత్తుగా వచ్చి ఆశ్చర్యపెట్టి సంతోష పరుద్దామన్న ఆశతో వచ్చి యేం చూసింది?

గుండె ఝల్లుమంటోంది.

ఢిల్లీ !!

—ఇది అసమర్థతకు రాజధాని!

పాపం శమించుగాక!

మా ఆవిణ్ణడగండి చెబ్తుంది. ఏం చూశా వమ్మా వచ్చినరోజు? తెల్లబోయి కొయ్యబారిపోయిన నా ముఖం!

ఆ తర్వాత—

దారిపొడుగుతా వర్షంలా తిట్లు!

"బుద్ధిలేదూ! నువ్వేమన్నా ఇంగితజ్ఞానం వున్న మనిషివేనా? ఎందుకూ ఇన్నాళ్ళు చేశావ్ కాపురం? నాలుగునెల్లు కొంపలో పడి వుండవే అని పుట్టింటికి పంపితే- నేను ఇలావచ్చి ఢిల్లీలో పాదం మోప్తానో లేదో....నెల్లాళ్ళన్నా కాకుండా తయారయ్యావ్- ప్యాసు ముక్క ఎరక్కపోయి నీ చేతులో పెట్టినందుకు ఇదా శాస్తి! ఇప్పుడిక్కడ కొంపయేదీ?....రైలంటూ వూరిఖేనేగదా అని పాతికో పరకో చేత్తో పుచ్చుకుని రైలెక్కావ్! ఇక్కడ నాకు ఇంకా జీతపురాళ్ళన్నా వచ్చి యేడవలేదాయే!"

ఇదంతా కోపంకానట్టు యీ అవమానాన్నంతా తుడిచేసుకుంటూ తెచ్చిపెట్టుకున్న నవ్వుతో-"ఈ భాగోతమంతా యిక్కడ ప్లాటుఫారం మీదేనా....యింటికి వెళ్లాక మీరెన్నన్నా అనొచ్చు నేను పడొచ్చు! మామూలేగా—"

నేను యింకా రెచ్చిపోయి తారస్థాయిలో—

"హాస్యమాడుతున్నా ననుకున్నావా? ఇల్లేవిటి నీ బొంద నా బొందాను....జాఫరీలో బెడ్డింగు పెట్టుకుని ఆఘోరిస్తూంటేనూ—" నా కింకా బాగా కళ్ళకు కట్టినట్లుంది.

"అయ్యో - ప్రేమను ఎత్తుకొని ముద్దాడరేమండీ? చంకలో చంటిపిల్ల మీ కేకలకు బిక్కచచ్చిపోయి ఎల్లా మిటుకూ మిటుకూ చూస్తోందో...."

నేను మతిపోయినట్లు ఆవిడగారు సంసారం నిమిత్తం తెచ్చిన పీటలు జాడీలు రుబ్బురోలు వగైరాలు వగైరాలు చూస్తూ కొయ్యబారి పోయాను. ఆ సామానులోనే యిరుక్కుని నిర్ఘాంతపోయి కూర్చున్నారు నా పెద్దకొడుకూ చిన్నకొడుకూనూ నేను వాళ్ళను చూడనన్నా లేదు. ఈలోగా రాణీగారి తమ్ముడొచ్చాడు. వీడు కూడా వున్నాడన్న మాట!—వుద్యోగం కోసం రాలేదుగదా! కాస్త అనుమానంగా చూశాను. అప్పటి కప్పుడే వాడు న్యూఢిల్లీ ప్లాటుఫారమంతా కలయ తిరిగొచ్చాడు. మా ఆవిడ తనకు జరిగిన మర్యాద అప్పుడే మర్చిపోయిందల్లే వుంది.

"అదేవిటండీ—వాణ్ణి పలకరించండీ!" అంటూ వెనకేసు కొచ్చింది.

జండాకొయ్యలా యెదిగిపోయాడు. నల్ల కళ్ళద్దాలు—ప్లాస్టిక్ బెల్టు- సిల్కు బుష్కోటూ—ఖరీదైన బూట్లూ—సిల్కు రుమాలుతో కళ్ళజోడు తీసితుడుస్తున్నాడు.

"ఏవిరా యీ మాటైనా ప్యాసయినావా?"

'హా!'—పూర్తిగా మాట్లాడ్డు గావల్సు: తమ్ముడి దర్జాకు మురిసిపోతోంది కాబోలు—

"పెళ్ళిసంబంధం వచ్చిందండీ. ఐదువేలు....సంబంధం చేస్తారేమోనని నాతో ఢిల్లీ చూస్తానని వచ్చేశాడు. సరే రమ్మన్నాను."

'యేడిచావు' అని లోపల్నే అనుకుని "పదపద ఆనక తాపీగా చెబ్దువుగాని కబుర్లు. ఆఫీసు మధ్యలో వచ్చేశాను" అని లోపల ఆక్రోశంతో సంసారం సంసారాన్ని న్యూఢిల్లీ స్టేషను కెదురుగానున్న 'లేడీ హార్డింజ్ శరాయ్'లో చేర్పించేసి మా బావమరిదికి వార్నింగు యిచ్చాను- 'నేను మళ్ళీ సాయంకాలం వచ్చేదాకా యెక్కడికీ కదలకుండా సామాన్నూ మనుష్యుల్నీ కనిపెట్టుకు నుండ'మని.

## 2

స్టేషను పేరు న్యూఢిల్లీ అయినా ఆ ప్రదేశాన్నంతా 'పాహడ్ గంజ్' అంటారు. లోకవ్యవహారానికి ఆ స్టేషన్నుకూడా జనం పాహడ్ గంజ్ స్టేషననే పిలుస్తూంటారు. అక్కడ పెద్ద బజారు, యింకా లోనికి పోనుపోను కూరల మార్కెటు అవీ వున్నాయి. న్యూఢిల్లీ స్టేషను ఆవరణ యెంత దర్జాగా ఠీవిగా సుందరంగా వుంటుందో ఆ కాస్త మేరా దాటాక అంత చెడ్డ గలీజుగానూ మురికికూపంలానూ వుంటుంది. ముఖ్యంగా 'లేడీహార్డింజ్ శరాయ్' కెదురుగా గుండ్రటి చిన్నపార్కు కట్టారు. అందులో పగలస్తమానూ సోమరులు పడి దొర్లుతూంటారు. ఈ పార్కుకు ప్రక్కనే ఒక పెద్ద చెట్టునీడను హమేషా మంగళ్ళు కత్తులు సానపడ్తూ కత్తెరలను టకటకలాడిస్తూ నిత్యకల్యాణంచేసి ఆ జుట్టునంతా పార్కునిండా పోసివుంచుతారు. ఇది చాల దన్నట్లు టాంగావాళ్ళు గుర్రాలను తెచ్చి నిలుపుతారు. అవి అన్ని పనులూ అక్కడే చేసి ఆ మార్గంగుండా నడిచి వెళ్ళవలసివస్తే పశువులకొట్టంలోంచి దాటుతూన్నట్లుంటుందిగాని - రాజధాని పరువు యెవరూ యెక్కడా నిలుపుతున్నట్లు కనపడదు. ఇక బజారులో దారి కడ్డంగా 'హాకర్లు' చక్రాలబళ్ళని తోసుగుంటూ 'పచ్చి అల్బకరాపళ్ళు-లీచీపళ్ళు - చర్మం నల్లగా కవిలిపోయిన అరిటిపళ్ళు - ముక్కలు ముక్కలుగా కోసిన పుచ్చకాయలు - మామిడి పళ్ళు' తూచి అమ్ముతూంటారు. ఈ బజారులోనే అన్ని దుకాణాల్తోనూ కలిసిపోయి అడుగడుగునా వెలపరం పుట్టించేలా కసాయిదుకాణా లున్నాయి. కాని యిక్కడదొరికే అన్ని వస్తువులూ చవక అంటారు. రైల్వే స్టేషను కెదురుగుండా వున్న దుకాణాలే కాకుండా, పేవుమెంట్లుమీద ఒక నులకమంచాన్ని గడకర్రతోయెత్తి వుంచి దానిక్రింద కొన్నిడజన్ల బూట్ పాలిష్ జోళ్ళరిపేరు వగైరా వగైరా కేంద్రా లున్నాయి. ఈ ప్రాంతం యిలా ఎందుకుందని యెవరైనా ప్రశ్నిస్తే కాందిశీకులు వచ్చి పాడుచేశారని అంటారు. ఈ హార్డింజ్ శరాయ్‌దగ్గర ఇండియా టీ బోర్డువారి వాహనం వచ్చి నిల్చుని అణాకు మంచి టీ సప్లయి

చేస్తూ వుంటుంది. ఈ రోడ్డు తిన్నగా కన్నాట్ సర్కస్‌లోకి వెళ్తుంది. దీనికి రైల్వేబద్దీలకు మధ్యనున్న మేరలోంచి స్టేటు ఎంట్రీరోడ్డు వేశారు. ముఖ్యంగా రాష్ట్రపతి యింకా గొప్ప గొప్ప అతిథులు ఈ గలీజు చూడకుండా స్టేషనుకు వచ్చీపోవడానికి ఇరుప్రక్కలా సుందరమైన ఉద్యానవనాలు పెంచారు. ఆ రోడ్డులోనే రైల్వేబోర్డు మంత్రాలయం, ఉత్తరరైల్వే మండలాధికారి ఆఫీసు, ఐ. ఆర్. సి. యే. భవనాలున్నాయి. కట్టడాల శిథిలాలు, మొగలాయి దర్బారులు, రాజఘాటు, ఎర్రకోట, జుమ్మామసీదు, నిజాముద్దీను, హస్తినాపురం, హుమాయూను సమాధి, సఫ్దర్‌గంజ్, కుతుబ్‌మినార్, చాందినీ చౌక్, పార్లమెంటు, సెక్రటేరియట్, రాష్ట్రపతిభవనాలు చూడవలసినవే అయినా చూడకూడనివి చూడ్డానికి వీల్లేకుండా కట్టుదిట్టాలు చేశారు. ఢిల్లీలోని యిరుకుతనాన్ని మురికితనాన్ని కప్పుకుందుకు కట్టుకున్న 'కన్నాటు ప్లేసు' ఎంతసేపు తిరిగినా నేత్రానందకరంగానే వుంటుంది. కాని నేను ప్రశ్నించుగుంటున్నది యిక్కడ సామాన్యుడు ఎట్లా జీవిస్తున్నాడు అని. పాలకులు పాలిస్తున్నారు సరే—ఈ కాలంలో పాలితులు ఎట్లా జీవిస్తున్నారు'

చెప్పమంటారా?

నాబోటివాడి జీతం సొంతకొంపలు కలవాళ్ళు కోరే అద్దెలకు చాలదు. సర్కారువారు యిచ్చేయిళ్ళు నాబోటివాడికి దొరకడానికి యింకా రెండుపంచవర్ష ప్రణాళికల కాలం తీసుకుంటుంది. ఐతే కొందరు మహానుభావు లుంటారు. అట్టివారు తాము సర్కారు వారికి యిచ్చే అద్దెకు మరో పదో పరకో ముట్టచెప్పి వారి కనుసన్నల్లో మెలగడానికి యిష్టపడినట్లైనా ఒక గది ఖాళీచేసి యిస్తారు. ఇచ్చేముందు కొన్ని పరీక్షలు - ఇంటర్వ్యూలూ - స్క్రీనింగు వగైరా కార్యక్రమాలున్నాయి. మచ్చుకి—

"ఎక్కడ పనిచేస్తున్నారు - (మినిస్ట్రీ)"

"ఫలానా - ఫలానా."

కొందరు బ్రహ్మచారులే కావా లంటారు. కొందరు సంసారులే వుండా లంటారు.

"ఎంత జీతం?"

చెప్పాక పెదవి విరిచి—నాలుక బైటపెట్టి, తలకాయ ప్రక్కకు త్రిప్పి వాంతి వొస్తూనట్లు మొహం పెడ్తాడు.

"మద్రాసీ—"

"కాదు ఆంధ్ర...." అని చెప్పబోతే అంతా వొకటే లెద్దూ అన్నట్లు చూసి—"ఏ వూరు?" ఆ వూరు వాడికి చెప్పినా అర్థమయి చావదు. తరువాత ఆ గదిలో యిదివరకు వుంటూ వచ్చిన వాళ్ళను గురించి ముఖ్యంగా భయంకరంగా వర్ణించి చెబుతాడు. అదే అదనను కొని యిదివరకు వున్న వాళ్ళ అవలక్షణా లన్నీ వర్ణించాక—కొంచెం సేపు తన అభిరుచులూ తన చుట్టాల్లో గొప్ప పదవిలో వున్న వాళ్ళను పరిచయం చేస్తాడు. ఈ ఆముదం మోతాదు తప్పించుకుందుకు మనం కాస్త ధైర్యంచేసి వాడి పిల్లల్ని పలకరించటమో, హఠాత్తుగా జన్మలో యెరగనట్లు వాడి సైకిలునో కుర్చీనో మంచాన్నో దేన్నో అతిగా మెచ్చుగుంటూన్నట్లు మాట్లాడాక మళ్ళీ క్రాసు పరీక్ష ఆరంభమవు తుంది.

"పెళ్ళయిందా?" చెప్పాక "ఎంతమంది పిల్లలు"- ఈ సమా ధానం చెప్పాక గది యిచ్చేదీ లేనిదీ వాడి ముఖవర్చస్సులోనే బైటపడి పోతుంది. "సంసారం ఎప్పుడు తీసుకువస్తావు?" అది వాడిని అడగా లని మనం అర్థం చేసుకోటాని కాట్టేకాలం పట్టదు. ఇక్కడ్నుంచి— "రేడియో వుందా? ఫాను....కుంపటి....ఇస్త్రీపెట్టి...." అన్నిటికీ లేదని చెప్పాక "సామాను బాగా వుందా? చుట్టా లెవరైనా వస్తారా?" చివరికి మనకి మతిపోయే పరిస్థితి తెచ్చి పెడ్తాడు ప్రశ్నలతో.

ఇల్లాటి అదృష్టమేనా పట్టనివ్వకుండా యింటావిడ హఠాత్తుగా ప్రత్యక్షమయింది. ఈ పరిస్థితి చెప్పుకోవటాని కెవరూ లేరు. అలవా టుగా ఆఫీసు వదిలాక బైటకొచ్చాను. ఎవరిళ్ళకు వాళ్ళు నియామకంగా సైకిళ్ళమీద బస్సులమీద కార్లమీద చేరుకుంటున్న సమయం అది. మధ్యాహ్నమల్లా యెండ పొడిచిందేమో ఐదుగంటలయాక కూడా సూర్యుడు యింకా తందనాలు త్రొక్కుతున్నాడు. అల్లాగే కాళ్ళీడ్చు కుంటూ 'శరాయ్'లో కెళ్ళాను. చూద్దునుగదా శ్రీమతి మాబావా పిల్లలూ

స్నానాలు అవీ చేసి రెడీగా ముస్తాబై కూర్చున్నారు. మధ్యాహ్నమల్లా నిద్రపోయి వుంటారు ప్రయాణం బడలికా అది తీర్చుకున్నారు.

"ఎక్కడికర్రా ప్రయాణం?!"

"ఈ చుట్టుప్రక్కలేమన్నా వుంటే కాస్త చూసి—పిల్లలకు యేదన్నా యింత తినిపించి కాస్సేపు అలా తిరిగివద్దాం. ఎంతకని యీ గదిల్లో యింతమందిమీ ముక్కిచావటం?"

సరే పదమన్నాను—నెమ్మదిగా మద్రాసు హోటలుకు పోయి కాఫీలు ఫలహారాలు పూర్తిచేశాం. మా ఆవిడ కొంచెం నాజూగ్గానే ముస్తాబయింది. నేను పగలల్లా చాకిరీచేసి వున్నానేమో ఎక్కడా త్రాణ లేదు వొంట్లో....కాస్సేపు యిద్దరమూ దొంగచూపులు చూసుకున్నాం. రాజీ పడబోతున్నామని గ్రహించినట్లున్నాడు మా బావమరిది—లేచి పిల్లల్ని తీసుగుని దూరదూరంగా తప్పించుగుని వాళ్ళకేవో ప్రశ్నలకు జవాబులు చెబ్తూ అవీ యివీ చూపిస్తున్నాడు. రీగాలు థియేటరు దాటి పార్లమెంటు వీధిలో కొచ్చాం. మా ఆవిడ జనాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తో నడుస్తోంది.

"దిక్కులు చూడకు, దేనిక్రిందన్నా పడ్తావు."

"అదేవిటండీ పల్లెటూరి దానికి చెప్పినట్లు చెబ్తారు?"

రయ్‌మంటూ వో స్కూటరు చక్కరకొట్టిమీద నుంచి దూసుకుపోయింది. చప్పున రెక్క పుచ్చుగు దగ్గరసా లాగాను.

"బావుందండీ! రోడ్డుమీద అలా జబ్బపట్టుగు లాగుతా రెందుకూ?" కోపంగా చూసింది.

"ఈపాటికి ఆసుపత్రిలో వుండేదానివి. అటు చూడు—"

ఎవరో ఒక అమ్మాయి లాంబరెట్టావెనుక సీటుమీద కూర్చుని మొగుడ్ని గట్టిగా నడుంచుట్టూ చేతులేసి పట్టుకుంటోంది. ఆ స్కూటరు వేగానికి పవిట నిలనటంలేదు. ఎర్రటి పెదవులు—రోజారంగు బుగ్గలు- క్షణంలో రివ్వుమంటూ దూసుకుపోయారు.

"ఎల్లా వుంది?"

"తగులబడ్డట్టే వుంది. వీళ్ళ కిద్దేం పొయ్యేకాలం—"

ఒకావిడ వెనుకసీటుమీద ఆరు నెల్ల పసిగ్రుడ్డు నెత్తుకుని

కూర్చుంది. ముగుడుగారు సైకిలు రొప్పుకుంటూ త్రొక్కుతున్నారు.

"అయ్యో, పడిపోతారేమోనండి!— వీళ్ళ అఘాయిత్యం మండా—"

"నీ యిష్టం వచ్చినట్లు అనుకో—నీమాట లెవళ్ళకీ బోధ పడవుగా!"

"ఐనా యిదేవిటండీ యిక్కడ ఆడవాళ్ళింత బరి తెగించి పోయారు? ఒంటిమీద గుడ్డెందుకూ సిగ్గన్నది లేకపోయాక—రామ రామ! అల్లా వీధిని తిరగటానికి పదిమంది కళ్ళు బడ్డానికి ప్రాణం పోదుటండీ?"

అంతా పోయి "జంతర్ మంతర్"లో కూర్చున్నాం. చెరుకు ముక్కలు కొని తెచ్చాను. పిల్లలు బఠాణీలు, వేచిన శనగలూ తెచ్చు కుంటున్నారు. మా బావమరిది యింకా బిడియంగా దూరం దూరంగా తిరుగుతున్నాడు.

"ఏరోయ్ బావా—యిటురా?"

నాకు దగ్గరసా వచ్చి కూర్చున్నాడు.

"మీ అక్క అంటుందీ, యిక్కడ ఆడవాళ్ళు బావులేరని— నువ్వేమంటావ్ కుర్రాడా?"

"బలే బావుంటారు....చక్కా జంటలు జంటలుగా సైకిళ్ళమీద చల్లగాలిలో—"

"పాడు బుద్ధులూ—ఇహ! వీడేం బాగుపడ్తాడూ?" చీకట్లో చేతుల్లు త్రిప్పుతూ పెద్ద అరిందాలా చెబ్తోంది.

రోడ్లమీద యీడువచ్చిన అమ్మాయిలు ఐసుక్రీములు తింటూ ఖులాసాగా సైకిలు త్రొక్కుకుంటూ పోతున్నారు. పంజాబీ డ్రెస్సులో శరీర ముఖ్యభాగా లన్నీ ఆ సిల్కు తళ తళలో మెర్కురీ దీపకాంతిలో అందులో సైకిలు త్రొక్కటంలో యిమిడివున్న శ్రమలో చెమర్చిన ముఖాల్తో నవ్వుకుంటూ మైమరచిన వుల్లాసంతో ఎంతో సహజంగా అందంగా కదలాడే దృశ్యాల్ని—కళ్ళు పెద్దవి చేసుకుని అర్థంగాక చీదరించుకుంటూ లేచి నిలబడి—"ఇక పదండి పోదాం, నాకు వెలపరం కూడా వస్తోంది" అని లేచింది యింటావిడ.

"కవులూ రచయితలూ నానా యమయాతనాపడి వర్ణించే అందాలన్నీ చూసి సంతోషించలేక ముఖం ముడ్చుకుంటా వెందుకూ? చూడు మగవాళ్ళతో సరిసమానంగా నిర్భయంగా స్వేచ్ఛగా ఎట్లా వుండగలుగుతున్నారో స్త్రీలు. ఆడవాళ్ళకీ మగవాళ్ళకీ తేడాలు ఎక్కువ తక్కువలు యేమీ లేవు."

"చాలించండి! ఆడా మగా తేడా లేదని వాదిస్తా రెందుకూ? వంట చెయ్యటం, యిల్లు కనిబెట్టుకోవడం, పిల్లల్ని కనడం, బట్టలుతకడం, కాపురాలు చెయ్యటం మానేస్తారా? పెళ్ళిళ్ళు చేసుకోవటంలేదా!- ఈ యేడుపంతా వీధుల్లో యెందుకంటాను నేను. ఆ యేడ్చే శృంగారమంతా నాలుగ్గోడల్లో, ముగుడన్న వాడికి పుస్తెకట్టినందుకు—అఘోరిస్తే చాలదా?"

"కాస్త అందంవుంటే అది నలుగురూ చూడకుండా దాచుకోమంటావ్. పోపుల పెట్టెలోనూ, పొయ్యి వూదేటప్పుడూ, పిల్లలికి నీళ్ళు బోసేటప్పుడూ, నోములూ పూజలు పునస్కారాలు చేసుకునే టప్పుడు ఆడవాళ్ళు చిన్న బట్టలు కట్టుకుని యింట్లో తిరగడం మానేస్తున్నారా? మన వూళ్ళో యింటిప్రక్కావిడ యెన్నిమాట్లు గజంనర తువ్వాలు పీకకు చుట్టుకుని వుదయమస్తమానూ యింట్లో దొడ్లో నూతి దగ్గర తులసి కోటదగ్గర మడివెలగబెట్టేస్తూంటే—నే నెందుకైనా కాస్సేపు అటు వెళ్తే నీ వెంత కొరకొరా చూసేదానివి? ఎవరి అలవాట్లు వాళ్ళకు నచ్చుతాయి. మనకు సరిపడని కొత్త సంగతు లనేకం వుంటాయి. వాటి నస్తమానూ అసహ్యించుకుంటూ కూర్చుంటామా?"

పవిటచెంగు నోటికడ్డంగా లాక్కుంటూ—

"అయ్యో మీ కింకా జ్ఞాపకముందిటండీ ఆవిడ- పాపం ఆయన పోయాడు తెలుసా?"

"అంత హఠాత్తుగా—పోకేం చేస్తాడు? ఆ యిల్లాలు ముప్పొద్దులా హింసించుకు తినేది. ఇప్పు డావిడ కింకేం కావలసినంత స్వేచ్ఛ—"

"అయ్యో పాపం—ఎంత చాకిరీ చేసింది! అంత యిదిగా

చూస్తుందనుకోలేదు సుమండీ! గోలు గోలున యేడ్చేసింది. ఇప్పుడా మనిషే కాదు."

"పోయేవాడు యెలాగూ పోతున్నాడు గనుక ప్రేమంతా వొక్క మాటు చూపించేసిం దన్నూ?"

నడుస్తున్నదలా చట్టున ఆగిపోయి సీరియస్‌గా-

"అలా మాట్లాడ్తా రెందుకూ? మనుష్యుల కష్టాన్ని గూర్చి చెబ్తూన్నపుడు అంత హేళన పనికిరాదంటాను. నిర్దయగా సానుభూతి లేకుండా వుండటం గొప్పనుకుంటున్నారు."

"అవును. గొప్పనుకుంటున్నాను."

"పోదురూ—బడాయిలు!"

"బడాయి కాదు....నీకు మటుకు నీకు తెలుసుగదా అవిడ ఎంత పేరు గడించుకుందో, ఎలాటి పతివ్రతో—మళ్ళీ తగుదునమ్మా అని వెనకేసు కెందుకొస్తావు? ఇప్పుడు నీకావిడమీద జాలి కలిగింది కాబట్టి నన్నుకూడా నీ వెనక్కాల తందానతాన పాడమంటున్నావు. అదే కుదర దోయ్—"

"మనుష్యులు ఎలాటివారైనా అకస్మాత్తుగా మార్పు వచ్చేస్తుంది. మునుపావిడ ఎలా వుంటే నేం-"

"—ఇప్పుడు భక్తురాలైనదందూ- ఆస్తి ఇల్లూ వగైరా అంతా వచ్చాక."

"అదేం కాదు—ఆ ముగుడు చాలా అన్యాయం చేశాడు. విల్లు రాయకుండా పోయాడు. అన్నదమ్ముల బిడ్డలొచ్చి ఆస్తి అక్రమించుకు కూర్చున్నారు. ఈవిడకి మనోవర్తి అన్నా దక్కకుండా చేద్దామని చూస్తున్నారు. పాపం ఆడది. వ్యవహారా లేం యెరుగదు. మరో దిక్కు లేదు—"

"మనిద్దర్నీ పెంచుకోమన లేకపోయావా?"

"అవునండీ-ఆవిడ ఎవర్నన్నా దగ్గర తీసుకుని ఎందుకు పెంచుకోలేదు? యిప్పుడు చెల్లదేవిటండీ? రూపాయికి బిందె చొప్పున నీళ్ళు మోస్తూ వంటలు చేసి వూరగాయలు పెట్టి కాలక్షేపం చేస్తూందండీ!

నాకు చూసినప్పుడల్లా కడుపు తరుక్కుపోయేది. నేనో రూపాయి పిలిచి యిచ్చేదాన్ని నెల నెలా—"

ఆవిడ దారుణమైన నేస్తురాలి జీవితాన్ని తలుచుకుని కుంగిపోయింది. నిజమే. ప్రపంచంలో దీనులు దుఃఖితుల గాథ లెన్నో వుంటాయి. అన్నిటికీ చలించిపోయి బెంబేలు పడిపోతే మనం ఎట్లా జీవిస్తాం? ఆవిడ స్వభావం కొద్దీ భర్తను హింసించేది-బాధలు పెట్టేది. తన యిష్టం వచ్చినట్లు వుండేది. కాని ఆవిడ యెన్నడూ అతగాడ్ని వదిలించుకుందామనిగాని, అతడు లేకుండా వుండాలని కాని కోరుకొని వుండదు. అవసరాలు తీరకపోయినా, ప్రేమలేకపోయినా, మనుష్యులు నిరంతరం యేళ్ళతరబడి ఒకే చోనులో నివసించడంవల్ల ఒకరు హఠాత్తుగా అదృశ్యమైతే ఆ లోటును భరించలేరు. ఇది చాలా సహజమని నమ్మే అనుభవంలేని మా ఆవిడ నాకు సానుభూతి సంస్కారం లేదని విసుక్కుంటోంది.

మళ్ళీ మద్రాసు హోటలు కొచ్చి భోంచేశాం. అంతాపోయి సత్రవులో పడుకున్నాం. గుఱ్ఱాలు దాణా నెమరేస్తూ వుండి వుండి సకిలిస్తున్నాయి. న్యూఢిల్లీ స్టేషనులో డీసెలు యింజన్లు మొరబెట్టున్నాయి. ఊరు నిద్రపోయింది. బస్సులు అక్కడా అక్కడా తిరుగాడ్తూనే వున్నాయి. దీపాలన్నీ పది గంటలకే సత్రవులో ఆర్పేస్తారు. మంచాలు లేవు- వరండాల్లో చాపలమీద దొర్లుతున్నాం. చెమట- వో రాత్రివేళ 'ఆంధీ' వచ్చింది. దుమ్ము దుమ్ము-ఇసుక తుపాను. కిటికీల తలుపులు బడబడా కొట్టుకొంటున్నాయి. ప్రక్క దుప్పటి యెగిరి పోయింది. పట్టుకుందుకు పరిగెత్తి పిల్లలమీద పడ్డాను. మొయ్యోమంటూ పిల్లలు లేచి యేడుస్తున్నారు. దుమ్ము వాళ్ళ ముక్కుల్లోనూ కళ్ళల్లోనూ కొడ్తోంది. మా బావ మరిది "బావా, నా లుంగీ యెగిరిపోయింది ఎటో-" అని గోలపెట్టాడు.

గొంతుక కూర్చోమన్నాను. మా ఆవిడ పిల్లల్ని లెక్కపెట్టుగుని దగ్గరసా లాక్కుని కూర్చుంది చీకటిని తిట్టుకుంటూ. దుప్పటి పట్టుగుని మా బావమరిది కిచ్చాను చుట్టుకోరా అని. గాలి వుద్ధృతంగా వీస్తోంది. కొంత సేపటికి టపటపామని పెద్ద పెద్ద చినుకులుపడ్డం ఆరం

భించాయి. ఈ దుమ్ము వచ్చాక ఆ పెద్ద చినుకులు వరండాలోకి కొడ్తూంటే అంతా లోపలికి గదిలో కొచ్చేశాం. పిల్లలు బిగ్గరగా బాకా పడ్తున్నారు, మంచి నీళ్ళు కావాలని. మా బావమరిది ఎట్లాగో టార్చి లైటు వెదికి తీసి పట్టుగొచ్చాడు. మరచెంబు తీసుకుని స్నానాలు గది వైపు జాగ్రత్తగా నడిచాను. అస్తవ్యస్తంగా వొళ్ళు తెలీకుండా ఎంత మందో నిద్రపోతున్న మనుష్యుల్ని దాటి పంపు పట్టుకున్నాను. కాని లాభంలేదు. నీళ్ళన్నీ ఎప్పుడో బందయాయి. తిట్టుకుంటూ టార్చిలైటు ఆర్పుతూ వేస్తూ వరండాలో కొచ్చాను. ఎవరో తలదగ్గర కూజా పెట్టు కుని నిద్రపోతున్నారు. ముట్టుకున్నాను. చల్లగా వుంది. గ్లాసు తీసేసి ప్రక్కనుంచి లైటార్పి కూజా యెత్తుకుని వేగంగా నడిచాను. పిల్లలు, యింటావిడ అంతా దాహం తీర్చుకున్నారు. మళ్ళీ కూజా యెత్తుకుని వెనక్కు వచ్చాను. కాని ఆ చీకట్లో యెవరి తలదగ్గర్నుంచి యెత్తు కొచ్చానో గుర్తులేదు. ఇంకా ఎక్కువసేపు ఆ వస్తువును చేతులో వుంచుగోవటం అట్టే మంచిదికూడా కాదు. అక్కడే యేదో కిటికీలో వుంచేసి గబగబా దొంగలా మళ్ళీ మా గది కొచ్చి పడ్డాను. తెల్లారాక చెబితే మా ఆవిడ పగలబడి నవ్వుతూ అంటుంది గదా "అవేం పను లండీ పాడుపనులూ-" అని. మా బావమరిది లుంగీకూడా దొరికింది— అక్కడే మొక్కలకు చుట్టేసుగుంది.

## 3

**ఊండవిచ్చిపోయిన** దారపుబండిలా లుంగలు చుట్టుకు పోతోంది జీవితం. ఎవడో సగం చావమోద్ది సైడుకాలవలోకి గిరాటు పెట్టిన బురదపాములా గిలగిలా కొట్టుకొంటున్నాను. ఇంత చిన్న వుద్యోగం చెయ్యటానికి యిన్ని వందల మైళ్ళు రావలసివచ్చిన నా దౌర్భాగ్యం యేమని చెప్పుకోను? కూటికి గుడ్డకు పనికిరాని నా చదువు, నలుగుర్లో మెప్పును అందుకోలేని నా చవకరకపు బాహ్యా వేషపు రీతులు-యిది నిరాడంబరతని నేను మురిసిపోదా మనుకుంటే వీల్లేకుండా, నలుగురూ చూపే నిరాదరణ-దాక్షిణాత్యులమని ఆడే

సూటిపోటి మాటలు అవహేళనలు....ఎన్నిటికని తట్టుకునేది? మంత్రాలయపు అన్ని కార్యాలయాల్లోనూ తమిళకూటా లున్నాయి. ముఖ్యంగా పంజాబీలకి తమిళులకూ పొసగదు. హిందుస్థానీలు, యూపీలు, వీరికి పంజాబీలకు స్పర్థలు-తెలుగువాళ్ళు బహుక్లిష్టంగా ఆదరణా గౌరవమూ లేకుండా 'మద్రాసీ' లని పిలవబడుతూ యీ పెద్దపెద్ద కూటాల మధ్య నలిగి, ఆత్మగౌరవమూ తెలుగు తనానికి తిలోదకా లిచ్చి యిటు తమిళులకు జోహారు లంటూనో అటు ఔత్తరాహులకు 'జీ' హుజూ రంటూనో బ్రతకాలిసిందే! ఒక జాతికి సరియైన ప్రాతినిధ్యం బలం గౌరవం స్థానం కేంద్రంలో లేకపోవటం వలన నాబోటి సామాన్యుడు కాస్త అభిమానం వున్నవాడు మానసికంగా న్యూనత పాలవుతున్నాడు. ఇవన్నీ ఎందుకు చెప్పాలి నొచ్చిందంటే- యీ కొంపకోసం తిరిగే చాంద్రాయణంలో కొందరు నన్నడిగిన అతి సామాన్య ప్రశ్నలు-తెలుగు ప్రజలు వింటే, 'పౌరుషగానాలు-పూర్వప్రశంసలు' కట్టిపెట్టి నిజంగా మనకున్న గౌరవం యెంతో మనం తెలుసుకున్నప్పుడు-కాస్త తల వంచుకుని ఛాతీ విరుచుకోకుండా నడవటమే మంచి దనిపించుకుంటుంది.

నేను సబ్బు బిళ్ళపెట్టివాడటం చూసిన నా యూపీ స్నేహితుడు- "ఓహో! మీ దేశస్థులు కూడా సబ్బు వాడ్డం నేర్చుకుంటున్నా రన్న మాట! ఐతే రెండు పూటలా స్నానం చేస్తారా?" ఒకరోజున మిఠాయికి రమ్మని ఎవరో పిలిచారు. "తొక్కుడు లడ్డూ, బరిఫీ జిలేబీలు" యిచ్చారు. "కచోడీ-సమూసా" ఖారం వేశారు. నేను తింటున్నంత సేపూ అతను నా జన్మలో అదే మొదటిసారిగా మిఠాయి తింటున్నట్లు వూహించుకుని మాట్లాడ్డం మొదలెట్టాడు. తాము నెయ్యి విరివిగా వాడ్తామని-నాకు నా జాతికి నేయి, వెన్నలాటి వస్తువులు తెలీవన్నట్లు ప్రసంగించాడు. "మీరు తమలపాకులు వేసుకుంటారా-" అనకుండా "తమలపాకులు తెలుసా" అని అడిగాడు. "పైజామా కఫ్నీ లాల్చీ" నేను కుట్టించుకోవడం చూసి—"మీరూ యీలాటి బట్టలు తొడుగుతారా?" నాకు వళ్ళు మండుకు పోయింది. తాము బహునాగరికులుగా విద్యావంతులుగా పరిగణించుకుని ఔత్తరాహులు వేసే ప్రశ్నలు విన్నాక— నాకు మన ఘనత రాజకీయ పరిజ్ఞానం, సారస్వతం, యిత్యాది విష

యాలపట్ల యేర్పడ్డ మమకారం దెబ్బతినడమే గాకుండా, మన లోపాలు కష్టాలు కారణాలు ప్రస్ఫుటంగా గోచరించసాగాయి. మరొకరు మీ దేశం నిండా ముష్టివాళ్ళు—అడుక్కోడానికికూడా యింత దూరం వస్తారు అని నేను యథాలాపంగా దారిలో ఎవరికో కాణీ ధర్మం చేస్తుంటే మనస్సు కలుక్కుమనేలా అనేశాడు. నిజమే మరి—బెజవాడలో, విశాఖపట్నంలో ఒక చోటేమిటి రైళ్ళలో ఎక్కడపడితే అక్కడ ముఖ్యంగా హోటళ్ళ యెదుట ఎంతమంది ముష్టివాళ్లు? ఎల్లా కాదనగల్ను?

నా జీవితం నడివీధిలో కొస్తే, నేను బుర్ర చించుకుంటూ 'కన్నాట్ ప్లేసు' లోపలి సున్నాలో చక్కర్లు కొడ్తుంటే 'కేశవరావు' కలిశాడు. అతను నన్ను చూడగానే బస్సుకోసం నిలబడ్డ క్యూలోనుంచి యీవలకు వచ్చేసి నా రెండు చేతులూ పుచ్చుకుని ముఖం కాస్త ముందుకు వంచి "ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి?" అంటూ పేవుమెంటు షాపుల్లోకి లాక్కెళ్ళాడు. ఇద్దరం కోకాకోలాలు పుచ్చుకున్నాం. పనామా సిగరెట్టు ముట్టించాం.

"ఇప్పు డెక్కడా యేమీ రాయటం లేదే—" ఒకప్పు డితను నాకు ఫాను. ఉత్తరాలు తెగరాసేవాడు. మూడోవాడి రచనల్ని యెప్పుడూ చీల్చి చెండాడ్డం అప్పట్లో హాబీ మాకు. అప్పటికే తెలుగు పాఠకుల్లో వంటింటి కథలూ, అబ్బాయి అమ్మాయిల బాధలూ, విడోమారేజి, కులతత్వాల మీద రచనలూ, గుమాస్తా గాథలూ చదివి చదివి విసుగెత్తిపోయి వున్నారేమో ఏదన్నా 'క్రొత్త' కోసం తహ తహ లాడిపోయే వాళ్లలో కేశవరావు వొకడు.

"అప్పుడు మీరు చక్కగా 'హాస్యం' రాసేవారు?"

"ఇప్పుడు యేడుపులో పడి కొట్టుకుంటున్నాను, తప్పితే బీభత్సం—"

"అల్లా అంటా రేమండీ?—"

"ఇదుగో అబ్బాయి—యిదివరకు ఏదో బరికేసి ఆ వెనక సంపాయించుకున్న పేరునే పొదుపుగా వాడుకునే వాళ్ళల్లో నేనొకణ్ణి. సరేనా—"

కేశవరావు పగలబడి నవ్వాడు.

"మాస్టారూ—యిక వ్రాయండి, ఇక్కడి కొచ్చేశారుగా—"

కేశవరావు 'మాష్టారూ' అనగానే అతడి ముఖంలోకి చూశాను. ఒకప్పు డితను నా దగ్గర చదువుకున్నాడు.

"పెళ్ళాడావా?"

"అబ్బే—నా కెవ రిస్తారండీ?"

"ఉద్యోగం?"

చెప్పాడు. ఎయిర్ లైన్లో ఏదో విదేశీకంపెనీ మానేజరుకి పి. యే. గా వుంటున్నాడుట—ఏడు వందలు. మొదట్లో స్టెనోగా చేరాడు. ఇంటరు పూర్తి చెయ్యలేదు. చదువుతూంటే తండ్రిపోయాడు. అన్న గారితో వదినతో తగూలాడి బెజవాడనుంచి పారిపోయాడు అప్పట్లో. ఇత నస్తమానూ మా యింట్లోనే వుంటూ యిక్కణ్ణే భోంచేస్తూండే వాడు యింట్లో పోట్లాడే సొచ్చి. నా సైకిలు అస్తమానూ పట్టుకుపోయే వాడు. నాకు సిగరెట్లు పోస్టుబిళ్ళలు కాగితాలు తెచ్చిపెట్టేవాడు. ఎప్పు డన్నా చిత్తు సాపు రాసేవాడు. కథలు పోస్టుచేసి పెట్టేవాడు. ఇతరు లతో నా వ్రాతల గురించి పోట్లాడేసొచ్చేవాడు. నేను కూడా సినీమాలకు తీసుకెళ్ళేవాడిని.

క్లుప్తంగా కేశవరావుతో నా సంగతి మా ఆవిడ బావమరిదీ పిల్లలు వచ్చిన సంగతి అంతా సూక్ష్మంలో బోధపర్చి చెప్పాను.

"ఐతే—నా గది యిచ్చేస్తాను. మా రూము కొచ్చేసెయ్యండి. తర్వాత యెక్కడన్నా చూద్దాము."

నేనూ కేశవరావూ సత్రవులో కొచ్చిపడ్డాము. మా యింట్లో యావన్మందికీ కేశవరావు తెలుసును. నా భార్య "ఏమోయ్-తప్పుకదూ, అలా పారిపోవచ్చా యెవరికీ చెప్పకుండా....మళ్ళీ బెజవాడ వెళ్ళావా మీ అన్ననూ వదిననూ చూసేందుకు?"

అతను ముసిముసిగా నవ్వుతూ నిలబడిపోయాడు. "ఈ వేషం సూటు బూటులో పోల్చుకోలేకపోయాను" అంటూంటే వారించి చెప్పాను-"మునుపటి కేశవరావు అనుకునే మాట్లాడేస్తున్నావు నోటి

కొచ్చినట్లు. అతను యేడువందలు సంపాయిస్తున్నాడు. ప్రయోజకు డయ్యాడు. సంతోషించు."

"నిజంగా!" ఆశ్చర్యపోయింది. కేశవరావు అంత ప్రయోజకు డవుతాడని యెవరూ నమ్మలేని విషయం. "ఎందుకండీ మాస్టారూ— అవన్నీ చెప్పేశారు. నన్నిక్కడ యెవరు చనువుగా కేకలేస్తారు చెప్పండి. నేను సరదాగా వింటూంటే—"

అంతా కేశవరావు గదిలో కొచ్చిపడ్డాం. ఆ గది కరూల్‌బాగ్‌లో మూడో అంతస్తులో ఒక మేడలో వుంది. అక్కడ మీదనే అన్ని సౌకర్యాలూ వున్నాయి. మా ఆవిడ తన అమాయకత్వంలోనే తమ్ముడికి కూడా కేశవరావులా ప్రయోజకుడు కావటానికి యేదన్నా చూసి పెట్టమని రోజూ అతడితో చెప్పి పెట్టేది. అతను వున్న ఒక్క గది చిన్న వరండా అంతా మాకోసం వదిలేశాడు. పిల్లలు పంపుత్రిప్పి అస్తమాను క్రింద కూర్చునేవారు. అతడూ మాతోనే భోజనాదికాలు చేయటానికి వప్పించేసరికి చాలా కష్టమయింది. పెసరట్లు వడలు బజ్జీలు యిడ్లీలు ఒకటేమిటి తిండిలో రోజూ ఆంధ్రత్వం మళ్ళీ విజృంభించ సాగింది.

ఒక రోజు కంపెనీకారు తీసుగొచ్చాడు. మా బావమరిది, పిల్లలూ మా ఆవిడ బిలాబిలా అంతా అందులో కెక్కారు. నే నేమో యిల్లు చూస్తానని వుండిపోయాను. కేశవరావు అందర్నీ తిరగడానికి తీసుకుపోయాడు. జీవితం కాస్త రాస్తాలో పడ్డట్లే వుంది. వరండాలో వాలు కుర్చీ లాక్కుని సిగరెట్టు కాలుస్తూ పేపరు చూస్తున్నాను. స్టూలు మీది టేబిలు ఫానుకు వుండి వుండి తడితువ్వాలు చుడ్తున్నాను. గాలి వెచ్చగా వస్తోంది. శరీరం బట్టను కూడా వోర్చలేని కాలం ఇది. ఈ గది మీదనుండేమో-చుట్టూతా రకరకాల మేడలు కిటికీలు ద్వారాలు చిన్నచిన్న బొమ్మల్లా కనుపించే మనుష్యులూ-తోటలు దొడ్లూ మొక్కలూ, బాగా దిగువను చీమల్లా పరుగెట్టే బస్లూ కారులూ అన్నీ మధ్య మధ్యన అవలోకిస్తున్నాను.

ఈ గొడ్డుకు బెత్తెడు జీతంతో ఈ పిల్లల్ని ఎట్లా పెద్దవాళ్ళను చేస్తాను? వీళ్ళకి చదువులు బట్టలు రోగాలు రొచ్చులు ఇవన్నీ నేను

ఎట్లా భరిస్తాను? ఇంత చిన్న వయస్సులో నాలుగూ చూడాలనీ అదీ ఇదీ కావాలనీ తెలిసీ తెలియకుండా అడిగే అడదాని మనస్సు నొప్పించ కుండా వుండగలనా? కేశవరావు మంచివాడే. ఇట్లా అతని పీకలమీద ఎన్నాళ్ళు కూర్చోవటం? ఆ మేడమీది అంతరిక్షంలోని గదికి అతను యాభై రూపాయ లిస్తున్నాడు. నాకు తెలీకుండానే నేను నా జీవితంతో అతడి జీవితాన్ని పోల్చుగుందు కుపక్రమించాను. నాకు జీవితంలో సంతోషంగా ఆనందంగా గడచిపోవలసిన కాలంలో సంసారం పెద్దదయి వుద్యోగం చిన్నదయి అంతా తిరగబడిపోయింది. కేశవరావు చిన్నతనంలో కష్టపడ్డాడు. నాకు తెలుసు. కాని ఇప్పుడు మంచి పదవిలో వున్నాడు. ఒక్కడు! కావలసినంత డబ్బు—మరో యేడాదిలో పెళ్ళాడినా సమస్య లేం లేవు. హాయిగా సుఖంగా జీవించటానికి ప్రాతిపదిక అప్పుడే యేర్పడివుంది. కోరికల్ని చంపుకో నక్కర్లేదు. నాకు అట్లాంటి దేం లేదు. చిన్నప్పుడే పెద్దవారి ముచ్చట కోసం పెళ్ళాడేశాను. చదువు పూర్తిగాకుండా వంశోద్ధారణకు కొడుకు—కంగారుపడి ఏదో వుద్యోగమని ప్రవేశించాక, ఆశయాలు అభిరుచులు కోరికలు అన్నీ మెల్లగా వొక్కటొక్కటీ తిరుగుముఖం పట్టాయి. ఇంట్లో పాల పీకలూ, యే మూల చూసినా పాతగుడ్డలూ, అటకమీద బస్తాలతో గొల్లభామ మార్కు పాలడబ్బాలు, ఒక ప్రేమ డైలాగన్నా చెప్పకుండా, ఒక యుగళగీతమన్నా పాడకుండా ఇంత ముంచుకు పోతుందని యెవరను కున్నారు? ఒంటరిగా కూర్చుంటే ఇల్లానే దిగులుగా వుంటుందని వరండాలో కుర్చీలోనుంచి లేచి లోపలకువెళ్ళి స్టవ్ ముట్టించాను—ఒక చుక్క కాఫీ గొంతుకలో పోసుగుంటే యేమన్నా మనస్తిమితంగా వుంటుందేమోనని నే నింకా కాఫీ గొడవలో వుంటూండగానే వరండాలో నుంచి కోమల కంఠం "నాకు కూడా మరో కప్పు కాఫీ పొయ్యి డార్లింగ్" అని వినిపించింది. బైటకువచ్చి చూద్దును గదా బంగారు మొలకల్లే ఒక పంజాబీ అమ్మాయి నా కుర్చీలో కూర్చొని జోడు విప్పుతూన్నదల్లా నా క్రొత్త మొహం చూసి—తెల్లతెలబోతూ "కేశీ—యిప్పు డీయింట్లో లేరా?" అని లేవబోతూ అడిగింది. "కూర్చో అంతా చెబుతా—" అన్నాను. నిల్చొనే వుంది. "నీ కోసం కూడా

మరో కప్పు కాస్తాను. కేశీ వస్తాడు. వచ్చేదాకా వుంటావా? ఎవరో వస్తారని చెప్పాడు. కాని ఆడా మగా చెప్పలేదు" అని లోపలి కెళ్ళాను. ఈ అమ్మాయి ఎవరో ఏవిటో తెలుసుకోవాలని చెడ్డ కుతూహలంగా వుంది. నీళ్ళు ఎక్కించి మళ్ళీ వచ్చి— "కూర్చో అమ్మాయి. ఫరవాలేదు. మావాడు నాకంతా చెప్పాడు. నే నెవరనుకుంటున్నావో—ఈ చేత్తో అరవై డెబ్బై ప్రేమకథలు రాశాను. మనకి అన్నీ కథలూ సుఖాంతం చేయటం ఎట్లాగో తెలుసు!"

ఆ అమ్మాయి కాస్త నవ్వి "కేశీ— యెక్కడికి కెళ్ళారు?" అంది. "నేనే పంపించాను— అస్తమానూ ఇంట్లో కూర్చుని నువ్వు రాలేదని తెగ యిదవుతూంటే, అలా తిరిగివస్తే కాస్త మనస్సు కోలు కుంటుందని."

"హ్హా! సారీ—" అని మూతి కాస్త చిన్నది చేసి పెదవుల్ని వంకరగా త్రిప్పి-మెడ కొంచెం అటూ యిటూ వూపింది.

"బావుంది అమ్మాయ్—నువ్విట్లా మావాడికి కొత్తగా కనిపించటమే మానేస్తే యేమన్నా బాగుంటుందీ? అస్తమానూ యిప్పుడు నువ్వు "కేశీ—కేశీ అంటున్నావా, అట్లాగే వాడూ ఏదో గొణుగుతాడూ ఫొటో దగ్గర పెట్టుకుని" కాఫీ కప్పు బల్లమీద వుంచుతూ "ఫోటో! అది మీ కెట్లా తెలుసు?" కాస్త సీరియస్‌గా అడిగింది. అలా బైట పడూ పిల్లా అని మనస్సులో అనుకున్నాను. వాలకమే చెబ్తోంది వర్కింగ్ గర్ల్ అని—కుర్రవాడు నాలుగు రాళ్ళు సంపాదిస్తున్నాడు గదా అని యిట్టే బుట్టలో పెట్టేసుంటుంది. ఐనా శుభ్రమైన "కో" అంటే కోటిమంది తెలుగు కన్యలుండగా మావాడి కిదేం దుర్బుద్ధి? పెళ్ళాడతానంటే—అప్సరల్ని తలదన్నే జాతి కన్యల్ను తెచ్చి అంట కడుదుమే. నా కెందు కీవిధంగా కేశవరావు తరపున పెద్దరికం నిర్వహించాలనీ, అతడి బాగోగులు వ్యవహారాల్లో పెట్టుగోవాలని గలిగిందో చెప్పటం సులభం. ఆ అమ్మాయి మళ్ళీ అడిగింది— "ఫోటో మీకు తెచ్చి చూపాడా?" అని.

"అరె—నువ్వెంత అమాయకురాలివి? మేవిద్దరం భౌతికంగా వేరుగాని మా ప్రాణాలు ఆత్మలు సర్వం వొహటే—నేను చూసి

అన్నాను గదా యీ అమ్మాయిని మా పిక్చర్లో బుక్ చేస్తే హీరోయిన్‌గా చాలా బాగుంటుంది—హిందీలో డబ్ చేసేటప్పుడు" అన్నా. సినిమాలంటే అమ్మాయిలు చెవిగోసుకుంటారని నాకు తెలుసు. "మీరు సినీమాలు తీస్తారా?" అంది కళ్ళు వీలయినంతగా పెద్దవిచేసి. నేను నవ్వి "పిల్లా—సినిమాలు తీసే మనుష్యులు యిలా ఎందుకుంటారు? ఇల్లాటి చిన్న ఆరేడు వందలు సంపాయించే 'కేశీ' లాటి వాళ్ళతో ఎందుకు వుంటారు? నేను నీకు ముందే చెప్పానే సినీమాలకు కథలు వ్రాస్తానని. ఇప్పుడు 'వర్కింగ్ గర్ల్' చిత్రానికి కథ కూరుస్తున్నాను. ఆలోచిస్తూ యిల్లా కూర్చున్నానో లేదో నువ్వొచ్చావు!"

ఆ పిల్ల కాస్త నిందాగర్భితంగా చేతుల్ని త్రిప్పుతూ—"చూశారా, అందుకే మీరు వచ్చాక నాకు రావద్దని కూడా కబురు చేశాడు. ఐనా చూద్దామని యిటొచ్చాను. నేను సినీమాలోకి బావుంటానా?"

"నాకు నచ్చబట్టే ఫొటోలో అమ్మాయిని గురించి మా వాడి నడిగి తెలుసుకుంది. సినీమా పేరు మా కంపెనీవారు 'టైపిస్టు గర్ల్' అని పెడ్దామనుకుంటున్నారు? నాకేమో ముందుపేరే నచ్చింది."

"మీకు నా ఫోటోలు కొన్ని పట్టుగొచ్చి యిస్తాను. మీ కంపెనీకి రాయండి నచ్చుతానేమో. ఈ టైపు కొట్టలేక ప్రాణం విగిసిపోతోంది."

"అమ్మ బాబో— యింకేమన్నా వుందా? మా కేశవరావుకు తెలిసిందంటే, నా ప్రియురాల్ని సినీమాల్లో ప్రవేశపెడ్తావా అని నా పీకుచ్చుగుంటాడు. ఐనా మీ రిద్దరూ ప్రేమించుగున్నారేమో, అతడ్ని కూడా అడిగి చూస్తేనే బావుంటుంది."

"కేశికి మీ రేమీ చెప్పొద్దు. ఆయనకు నే నే సావకాశంగా అంతా చెప్తాను. నేను యిక్కడకు వచ్చానని చెప్పకండి. నేనూ చెప్పను. ధన్యవాదాలు—మీలాటి గొప్పవార్ని కలిసే అదృష్టం కలిగినందుకు నిజంగా నేను గర్వపడుతున్నాను సెలవు."

ఆ అమ్మాయి నాజూకుగా వచ్చినట్లే నిష్క్రమించింది. అంతసేపూ మే మిద్దరమూ హిందీలోనే మాట్లాడాము. నేను కుర్చీలో జార్లె

బడి పగలబడి నవ్వుకున్నాను. ఎన్నాళ్ళ తర్వాతో నాకు జీవితంలో నిజ మైన హాస్యం కళ్ళకు గట్టినట్లు కనిపించింది.

ఇక్కడ మీకు అనేక సందేహాలు కలుగుతాయి. నిజంగా నేను యింత చాకచక్యంగా హాస్యం మాట్లాడగలిగివుంటానా, తర్వాత ఆ అమ్మాయి ఫొటోలు తెచ్చిందా? మళ్ళా ఆ పిల్లను కలుసుకునే ధైర్యం నాకుందా? నా కొంపవిషయం యేమైంది? మా బావమరిదికి వుద్యోగ మైందా? ఈ సోది ఎప్పటికన్నా ముగుస్తుందా అని.

బాబూ నన్ను కాస్త చెప్పనియ్యండి!

ఇప్పుడు వచ్చి 'ఫ్లా' అధ్యాయంలో పడ్డాం. ఈ 'ఫ్లా' కథ లోకి రాకముందు ఆ అమ్మాయి ఒక రోజున ఫొటోలు పుచ్చుకుని నా కోసం వచ్చిందట. అప్పుడు నేనూ—కేశవా యిద్దరమూ యింటిదగ్గర లేము. మా శ్రీమతి పిండి రుబ్బుతున్నది కాబోలు. దానికి హిందీ బొత్తిగా రాదు. ఆ అమ్మాయే ఏవో వాకబులు చెయ్యటం, యీ మనిషి తెలుగులో మాట్లాడ్డం అయాక, రుసరుసలాడుతూ వెళ్ళిపోయిందని మా ఆవిడ కథనం.

ఈలోగా నాకు తెలియని కథ కొంత మా ఆవిడ కూడా జరి పించింది. ఆవిడకు 'పెళ్ళి ట్రయినింగు' పొందుతున్న వొక చెల్లెలు వుంది. దాన్ని తీసుకుని వచ్చి రెక్కలు కట్టుకు వాలమని మా మావగా గారికి జాబు వ్రాయించింది. 'ఇక్కడ రత్నంలాంటి కుర్రవా డున్నాడు. ఏడువందలు నెలకు—రొట్టె విరగ్గొట్టండి, నేతిలో పడెయ్యండి' అని. నా కొంప విషయం కదూ—ఇది 'ఫ్లా' అధ్యాయంలో చేరుతుంది. 'కేశవ'ని వాళ్ళ ఆఫీసులో వొకరు బ్రతిమాలగా బ్రతిమాలగా వప్పు కున్నాట్ట—ఆయన మూడు నెలల సెలవులో మద్రాసు వెళ్తున్నప్పుడు ఆయన కొంప దొంగలు దోచకుండా రక్షించేటందుకు. రెండు పడక గదులు, రెండు బాత్‌రూంలు, బాత్‌రూంలో నిలువుటద్దాలు (ఎందుకని అనవసరపు ప్రశ్నలు వెయ్యకండి.) ఒక స్టోరు రూం. ఒక డ్రాయింగు రూం— గది గదికి ఫాను—వగైరా, వగైరా. దమ్మిడీ అద్దె లేకుండా, నీటి కర్చూ, వెల్తురు కర్చూ, గాలి కర్చూ లేకుండా మూడు నెలలు సకల రాజభోగాలూ అనుభవించమని కేశవరావు చెప్పాడు. తర్వాత

"దేఖాజాయగా." అస్సలు విషయం ఆ ఆఫీసరు కుటుంబం యావత్తూ మద్రాసులో 'ఫ్లూ' సుఖం అనుభవిస్తున్నారట!

టింగురంగామని మేడమీది గదిన్నర కేశవరావు వాటాలోంచి పడకగదికీ పడకగదికీ మధ్య లావెటరీ బాత్‌రూంగల బంగాళాలో కొచ్చి పడ్డాం. కేశవరావు ఎందుకి సదుపాయం చేశాడో నాకు పూర్తిగా తెలుసు. ఆ పంజాబీ అమ్మాయి నా చమత్కారమంతా కేశవకు చెవి గొరికి వుంటుంది. నా కళ్ళముందు కుర్రాడు బైటపడతాడు. ఇదేమీ తెలియని నా పూర్వకాలపుటిల్లాలు కేశవరావు యింతకాలం పెళ్ళి చేసుకోనిది తన యెదిగిన చెల్లెల్ని చేపట్టడానికనే వూః కలలు గంటోంది. కలలు మంచికే అంటారు మన తత్వశాస్త్రవేత్తలు.

ఇక్కడేం జరిగిం దంటే—

బంగళాలో రాజాలా వుంటున్నామని చెప్పానా- గేటుమీద 'సుబ్బరామన్' అని రాసుంది. ఆయన అనుకోకుండా విమానంమీద యావత్తు సంసారంతోనూ వచ్చి పడ్డాడు. (విమానంమీద వస్తాడని ఎల్లా అనుకుంటాం చెప్పండీ! మూడు రోజులు నడుములు పడిపోయేలాగ జీ.టీ. లో రాక.) అప్పుడు మా బావమరిది రేడియో ట్యూను చేస్తున్నాడు. మా మరదలు పిల్ల పెళ్ళి చూపులకోసం వచ్చినది:

"నే నే జాణనా-
చిన్నదానై నా..... నేనే జాణనా! ఏలుకో నా
స్వామి నా తమిదీర్చేటందుకూ....."

హార్మనీ మీద సాధకం చేస్తున్నది.

నేను చిన్న తువ్వాలు చుట్టుకుని బాత్‌రూంలో అఘోరిస్తున్నాను. మా ఆవిడ వంట యింట్లో చుంయ్ చుంయ్ మనిపిస్తున్నది.

ఆ సుబ్బరామన్‌గారెవరో మాకు తెలీకపాయె! ఆయన ముఖం వాలిచిన ఎర్రపంపర పనసకాయలా వుంది. ఆ యిల్లాలు చీర కట్టుకున్నది. ఇద్దరు అమ్మాయిలు చిన్న చిన్న హేండ్‌బాగ్‌లు పట్టుకుని నిల్చున్నారు. నేను కాస్త కథకుడ్ని గనుక యిది ఫలానా అని గ్రహించుకుని- "సార్! సార్!" అని వినయంగా "యీ యిల్లు జాగ్రత్తకోసం ఏయిర్ లైన్స్ పి. యే. గారు మమ్మల్నిక్కడ వుండమని మరీ గట్టిగా చెప్పారు.

తమరు చెప్పకుండా వచ్చారు. ఐనా మీ యిల్లు భద్రంగా చూడ్డానికి మేంపడ్డ అవస్థ వర్ణనాతీతం.. చూడండి ఆ మొక్కలు లతలూ అవీ చిగురించాయంటే యీ చేతుల్తో నీళ్ళు మోసి మోసి మా యావిడ——"

"పి, య్యే. ఎవరూ? నే నే పి. య్యేకు చెప్పలేదే - మిమ్మల్నిందులో ఎవరుండ మన్నారు?"

మనిషి యింకా గర్జించటం మానలేదు.

"మీ వస్తువులూ సామానులూ అన్నీ సరిగా వున్నాయో లేవో చూసుకున్నాకే మమ్మల్నిక్కడ నుంచి పొమ్మనండి. మేం మీ యిల్లు జాగ్రత్తకోసం యిందులో వున్నామని నేను నొక్కి చెబుతున్నాను. మీకు మరోలా తోస్తే మీరు పోలీసులకు కబురు చెయ్యొచ్చు!"

ఈ లోగా మా యావిడ గరిట చేత్తో పుచ్చుకుని రంగస్థలం మీదకు వచ్చింది. నేను సంతోషం కనబరుస్తూ "సుబ్బరామన్‌గారు వచ్చారే - చప్పున కాఫీలు చేసిపెట్టు. అమ్మా, యిక మీరు యింట్లోకి వెళ్ళండి. ఎప్పుడు యీ బాధ్యత నాతలమీద నుంచి తప్పుతుందా అని దేవుళ్ళకు మొక్కుతున్నాను. మీ వస్తువు లన్నీ సరిగా వున్నాయో లేవో ముందు చూసుకుని మాకు సెల విప్పించండి" అని మాబలగం యావత్తూ తలొక వస్తువూ పట్టుకుని శ్రీ వారి సామాన్ను బంగళా అంతర్భాగంలోకి చేర్చాము. సుబ్బరామన్ గారు చిరాకుగానే వున్నారు. కాఫీలు పడ్డాక ఆయన మళ్ళీ చిరాగ్గా "మీకు తాళాలు ఎవ రిచ్చారు?" అన్నారు.

"మీ. పి. ఏ."

"నా పి. ఏ ఎవరు? నేను నా ప్యూను కిచ్చానే——"

"మీ ప్యూన్ పి. ఏ. గారి కిచ్చి వుండొచ్చు."

"డామిట్——నే నే నయ్యా పి. ఏ. ను. నా ప్యూను కేశవరావనే కుర్రాడి కిచ్చాను."

"కేశవరావు ప్యూనా...." నాకు షాకు తగిలి నట్లయింది. "తాను పి. ఏ. నని ఏడువందలు జీతమని నాతో చెప్పాడు?"

"వెధవ——"

సుబ్బరామన్ గారు సోఫాలో లుంగలు చుట్టుకు పోయారు

నవ్వు ఆపుకోలేక. ఆయన తన కుటుంబంలో అందర్నీ పేరు పేరు వరసల్నా పిలిచి యీ సంగతి చెప్పి వాళ్ళందర్నీ నవ్వించారు.

నేను కొయ్యబారిపోయాను. మా అవిడ ముఖాన కత్తిగ్రేటుకు నెత్తురు చుక్కలేరు.

సుబ్బరామన్ గారికి నా కథంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాను. కేశవరావు నా దగ్గర యేమీ డబ్బు కూడా తీసుకోలేదని, కేవలం "ఇల్లు జాగ్రత్త" గా చూడమని మాత్రం చెప్పాడని, అందుచేత అతణ్ణేమీ చెయ్యొద్దని, నేను తిరిగి యే సత్రవుకో మకాం యెత్తేస్తానని సవిన యంగా చెప్పుగున్నాను.

సుబ్బరామన్‌గారు ఫోను రింగుచేసి ముందర కేశవ విషయం అడిగారు. తరువాత యేమి విన్నారో, నన్ను మాత్రం కేశవ యిల్లు చూసి రమ్మన్నారు. నేను బయల్దేరుతూంటే మా ఆవిడ కళ్ళనీళ్ళు బెట్టుగుంటూ "ఇదంతా యేమిటండీ?" అని దారికడ్డంవచ్చి నిల్చుంది. 'జీవితం' అని గబగబా రోడ్డుచ్చుగున్నాను. బస్సులో సీటు దొరికే సరికి ఆలస్యమయింది. నేను వెళ్ళేసరికి మేడ మెట్లవద్ద పోలీసులు వున్నారు. జనం గుంపు మాత్రం క్రింద ప్రోగయింది. నన్ను సుబ్బ రామన్‌గారు పంపించారనీ పైకి వెళ్ళనిమ్మనీ చెప్పాను. నేను మీదకు చేరేసరికి చూసిన దృశ్యం తాలూకు సందర్భం యిది—

ఆ పంజాబీ అమ్మాయి నన్ను చూసింది. కళ్ళు ఎర్రగా వాచి వున్నాయి. ఏడుస్తోంది. గదిలో సామాను లన్నీ చిందరవందరగా పడేసి వున్నాయి. పోలీసు సిబ్బంది సిగరెట్లు కాలుస్తూ తీరిగ్గా మాట్లాడు కుంటున్నారు.

"కేశవా" అన్నాను గొంతెత్తి.

చిన్నప్పుడు నేను యిట్లాగే మందలించేవాడిని, వాడు యింట్లో తగూలాడేసి వచ్చినపుడు.

—వాడి చేతికి బేడీలు వేసివున్నాయి.

నన్ను దగ్గరసా రమ్మని సంజ్ఞచేశాడు. వెళ్ళాను.

"ఒక సిగరెట్టు యివ్వండి. మాస్టారూ—యిప్పుడు చేతుల్లేవు."

సిగరెట్టు అంటించి యిచ్చాను. నోటి దగ్గరకు.

"జైల్లో బీడీ ముక్కలన్నా దొరకవు."

"ఏమిటిదంతా-ఏం చేశావు?"

"నన్నడక్కండి."

"నాయనా-యిదంతా నా కోసమేనా?"

నాకు కళ్ళల్లో కృతజ్ఞతతో నీళ్ళు తిరుగుతున్నాయి. చేరుమాలుతో వొత్తుకుంటున్నాను.

"సుబ్బరామన్‌గారు చాలా మంచివారు. నన్ను కన్న కొడుకులా చూసేవారు. ఆయన యిల్లు జాగ్రత్తగా వప్పగించేశాక మీరిందులోకి వచ్చి వుండండి. ఈ సామాను అంతా యిక మీది. ఇందులో పూచిక పుల్ల యెవర్దీ లేదు. నిన్న మీ మరదలు కోసం చోళీ గుడ్డ, పిల్లలకు పిప్పరమెంట్లు తెచ్చాను. యీ పోలీసులు చిందర వందర చేసేశారు. ఎక్కడో వుంటాయి. అవి వాళ్ళ కివ్వండి. ఇల్లు జాగ్రత్త!"

"ఇవ్వేం మాటలు నాయనా—"

నా గుండె తరుక్కుపోతోంది. పంజాబీ పిల్లను చూపించి "ఇది నేనేమో స్వర్గాలు వొరగపెడతా ననుకుంది. నన్ను మర్చిపొమ్మని, పెళ్ళాడి సుఖపడమని మీరు చెప్పాలి తర్వాత!" పోలీసులు నాతో కొంతసేపు మాట్లాడారు. కేశవ వాళ్ళకు ఆ యిల్లు నాకు వప్పగించమని చెప్పాడు. వాళ్ళు అతణ్ణి వానులోకి తీసుకు పోతూంటే నేను వెళ్ళి "కేశవా" అని గట్టిగా కావలించుకున్నాను. పోలీసులు విసురుగా లాగి త్రోసేశారు నన్ను. ఆ పంజాబీపిల్ల పట్టుగుంది. ఇద్దరం మెట్లమీద కూర్చుని కాస్సేపు యేడ్చాం. ఇంటికి కాపలా వున్న పోలీసులు మధ్యాహ్నానికి తాళాలు లిస్టులు నాకు వప్పగించి సంతకాలు తీసుకున్నారు.

సుబ్బరామన్‌గారు తర్వాత అంతా చెప్పారు-విమానాల్లో కొన్నాళ్ళనుంచి యితర దేశాలనుంచి దొంగతనంగా వస్తువులు వెండి బంగారం నల్లమందు కొని తేబడుతూన్నవట. దానికి సంబంధించిన కూటానికి చెందిన ప్రముఖ వ్యక్తి 'కేశవ' అని కస్టమ్సు శాఖ పట్టుకున్నా రని. ఆయన కూడా 'కేశవ' నిజాయితీ పరుడే కాని- భారీ యెత్తున డబ్బు సంపాయించే వుద్యమంలో చేరటం బహుశా దారిద్ర్యంవల్ల కావచ్చునని తేల్చారు.

మేం యిప్పుడు కేశవ గదిలో మీదన మేడమీద వుంటున్నాం. మా బావమరిదికి సుబ్బరామన్‌గారు వుద్యోగం వేయించారు. అన్నట్లు చెప్పటం మరిచాను. యీ యింటికి కేశవ మూడేళ్ళు డబ్బు కట్టి కంట్రాక్టు రాయించుకున్నాడుట. అందుచేత మాకే పోటీలేదు. మా మరదలు సంగతి అడుగుతున్నారా? చెప్పను. మా ఆవిడ అంటుంది గదా 'ఇంకా నయం వాడి మాటలు నమ్మి దీని గొంతుక కోశాం గాదు' అని.

ఆ పంజాబీ అమ్మాయి ఒక రోజు బజార్లో కనిపించి చేతివేళ్లు నొప్పు లెడుతున్నాయని తన చేతుల్ని నాకు చూపించి మాటల సందర్భంలో—'ఏ దన్నా కథ వ్రాసి పెట్టండీ మా మీద' అని అడిగింది. ఒక రోజు సినీమాహాల్లో కనిపించింది, ముందు 'రో' లో. బుజంమీద తట్టాను. వెనక్కు తిరిగి చూసింది. 'ఎల్లా వున్నావ్?' కాస్త నవ్వింది.

ఈలోగా తెరమీద బొమ్మలాడ్డం ప్రారంభమయింది.